News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :237 | ఖమ్మం | మంగళవారం అక్టోబర్ 7, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# నవంబర్ 11న జూబ్లీహిల్స్ పోలింగ్

- అక్టోబర్ 13 న నోటిఫికేషన్
- అక్టోబర్ 13న నామినేషన్ల స్వీకరణ
- అక్టోబర్ 21న నామినేషన్లకు చివరి తేది
- అక్టోబర్ 22న నామినేషన్ల పరిశీలన
- అక్టోబర్ 24న నామినేషన్ల విత్ డ్రా
- నవంబర్ 11న పోలింగ్
- నవంబర్ 14న కౌంటింగ్






జూబ్లీహిల్స్ బైపోల్ షెడ్యూల్ ప్రకటించింది జాతీయ ఎన్నికల సంఘం. బీహార్ తో పాటు దేశ వ్యాప్తంగా 8 స్థానాలకు ఉపఎన్నిక షెడ్యూల్ ను రిలీజ్ చేశారు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. జూబ్లీహిల్స్ బైపోల్ నవంబర్ 11న జరగనుండగా..14న కౌంటింగ్ జరగనుంది.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్**

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ 2025జూన్ 8న మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీతను ప్రకటించింది. ఎలాగైనా సిట్టింగ్ సీటును దక్కించుకోవాలని చూస్తోంది.

**కాంగ్రెస్ లో తీవ్ర పోటీ**

ఇక కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముగ్గురి పేర్లు రాష్ట్ర అధిష్టానం ఏఐసీసీకి పంపించింది. అందులో ఒకరు నవీన్ యాదవ్, బొంతురామ్మోహన్, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఉన్నారు. ఇందులో ఎవరికో ఒకరకి జూబ్లీహిల్స్ టికెట్ దక్కనుంది.

**ఫైనల్ కానీ అభ్యర్థి**

ఇక బీజేపీ కూడా అభ్యర్థిని ఫైనల్ చేయలేదు. జూబ్లీహిల్స్ టికెట్ కోసం బీజేపీ నుంచి లంకాల దీపక్ రెడ్డి, జయసుధ, చింతల రామచంద్రరావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. చివరికి ఎవరు బరిలో ఉంటారో చూడాలి.

**3 లక్షల 99 వేల ఓటర్లు**

జూబ్లీహిల్స్ లో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 2,07,367 మంది, మహిళా ఓటర్లు 1.91,590 మంది ఉన్నారు. అలాగే ఇతరులు 25 మంది ఉన్నారు. నియోజకవర్గం ఓటర్లలో 80 ఏండ్లకు పైబడిన వృద్ధుల్లో పురుషులు 3,280 మంది, మహిళలు 2,772 మంది ఉన్నారు. ఇక ఎన్ఆర్ఐ ఓటర్లు 95 మంది కాగా, సర్వీస్ ఎలక్టోరల్స్ 18, పీడబ్ల్యూడీ ఓటర్లు 1,891 మంది నమోదయ్యారు. నియోజకవర్గంలో 407 పోలింగ్ స్టేషన్లుండగా.. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో యావరేజ్?గా 980 మంది ఓటర్లు ఉన్నారు.

# దేశంలోనే రికార్డ్ ధర..

## హైదరాబాద్‌లో ఎకరం రూ.177 కోట్లు

నాలెడ్జ్ సిటీలో ఎకరా రూ. 177 కోట్లతో సరికొత్త రికార్డు

వేలంలో 7.6 ఎకరాలను దక్కించుకున్న ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ

మొత్తం రూ. 1357 కోట్లకు భూమిని చేజిక్కించుకున్న సంస్థ




వివరాలు 2లో..

## మేడారంలో పనులు స్పీడప్.. సర్కార్ మాస్టర్ ప్లాన్ అమలు




**గద్దెల వద్ద చెట్లు, వాచ్‌టవర్ల తొలగింపు**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులు స్పీడందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్?ప్లాన్ అమలులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి గత నెల 23న అమ్మవార్లను దర్శించుకొని పనులు ప్రారంభించిన

వివరాలు 2లో..

## వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన నోబెల్ బహుమతి




- మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి ప్రతిష్ఠాత్మక పురస్కారం
- రోగనిరోధక వ్యవస్థపై పరిశోధనలు చేసినందుకు నోబెల్
- ఈ నెల 13 వరకు కొనసాగనున్న నోబెల్ బహుమతులు

వివరాలు 2లో..

## నేను ఓడిపోయినప్పుడు జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారు పవన్ కల్యాణ్



- కర్ణాటకలో జస్టిస్ గోపాల గౌడ అమృత మహోత్సవం
- వేడుకలకు హాజరైన పవన్ కల్యాణ్
- రాజకీయాల్లో ఓడినప్పుడు తన భుజం తట్టి ధైర్యం చెప్పారని వెల్లడి
- జనసేన సిద్ధాంతాలకు గౌడ బలమైన మద్దతుదారుడన్న పవన్
- నల్లమల, భూసేకరణ పోరాటాల్లో ఆయన దిశానిర్దేశం చేశారని కితాబు

వివరాలు 2లో..

## బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట.. పిటిషన్ కొట్టివేత




- రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన రేవంత్ సర్కార్
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటాయంటూ పిటిషనర్ వాదన
- తెలంగాణలో అక్టోబర్ 9 నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు

వివరాలు 2లో..

## బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- రెండు దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు.. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు
- 14 లక్షల కొత్త ఓటర్లు సహా 7.43 కోట్ల ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- తుది జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు ఇచ్చామన్న ఈసీ

వివరాలు 2లో..




## భారత నౌకా దళం లోకి మరో బ్రహ్మాస్త్రం

- విశాఖలో జలప్రవేశం చేసిన ఐఎన్ఎస్ ఆండ్రోత్ యుద్ధనౌక
- నౌకాదళంలో చేరిన రెండో యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ నౌక
- శత్రు జలాంతర్గాములను వేటాడటంలో ప్రత్యేక సామర్థ్యం
- 80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం
- భారత సముద్ర తీర రక్షణ మరింత పటిష్ఠం
- లక్షద్వీప్‌లోని ఆండ్రోత్ ద్వీపం పేరుతో నామకరణం



సరిహద్దు దేశాలతో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో భారత అమ్ముల పొదిలోకి మరో బ్రహ్మాస్త్రం చేరింది. ఐఎన్ఎస్ ఆండ్రోత్ జాతికి అంకితం అయింది.

వివరాలు 2లో..

## బెంగళూరులో తేల్చుకుని రండి



- అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గింపుపై కర్ణాటక ప్రభుత్వంతో తేల్చుకుని రావాలని సూచన
- దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే అల్మట్టిపై గొంతు విప్పడం లేదేమని ప్రశ్న
- ఖర్గేను ఒప్పించి.. మెప్పించి రావాలన్న కవిత

వివరాలు 2లో..

## మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన రేవంత్ రెడ్డి

- అస్వస్థతతో ఆసుపత్రిలో చేరి ఇటీవల డిశ్చార్జ్ అయిన ఖర్గే
- గుండె వేగం తగ్గకుండా పేస్ మేకర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన వైద్యులు
- బెంగళూరుకు వెళ్లి ఖర్గేను పరామర్శించిన రేవంత్ రెడ్డి



వివరాలు 2లో..

## రాజస్థాన్ ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలి ప్రియాంక గాంధీ

న్యూ దిల్లీ : ఆదివారం రాత్రి జైపూర్ లోని సవాయి మాన్ సింగ్ హాస్పిటల్‌లో ట్రామా కేర్ విభాగంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగడంతో ఆరుగురు అగ్నికి అహుతయ్యారు. ఈ ఘటన పై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని



వివరాలు 2లో..

# బెంగళూరులో తేల్చుకుని రండి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశారు. అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు విషయమై కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చించి ఒక స్పష్టమైన నిర్ణయానికి

రావాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. "కర్ణాటకలో పర్యటించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్లిఖార్జున ఖర్గేతో చెప్పించి అల్మట్టి ఎత్తు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు.
దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చే అల్మట్టి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని కవిత ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నాయని, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు కాంగ్రెస్ అధిష్ఠానమే పెద్ద దిక్కు అని ఆమె గుర్తు చేశారు.మల్లిఖార్జున ఖర్గేను పరామర్శించి రాజకీయాలు మాట్లాడేందుకు కర్ణాటకలో పర్యటిస్తున్న రేవంత్ రెడ్డికి ఆమె ఒక విజ్ఞప్తి చేశారు. సొంత జిల్లాతో సహా దక్షిణ తెలంగాణకు సాగునీరు అందకుండా చేసే అల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై బెంగళూరులోనే ఒక స్పష్టమైన హామీ తీసుకొని తెలంగాణకు తిరిగి రావాలని ఆమె హితవు పలికారు.మల్లికార్జున ఖర్గేను ఒప్పించి, మెప్పించి ఆయన ద్వారా కర్ణాటక ముఖ్యమంత్రికి అల్మట్టి ప్రాజెక్టుపై స్పష్టమైన సూచనలు వచ్చేలా చూడాలని కోరారు. అల్మట్టి ఎత్తు తగ్గింపుపై స్పష్టమైన ప్రకటనతోనే రేవంత్ రెడ్డి తెలంగాణలో అడుగు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## రాజస్థాన్ ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలి ప్రియాంక గాంధీ

మొదటి పేజీ తరువాయి
తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని రాజస్థాన్ ప్రభుత్వాన్ని ఆమె కోరారు. ఈమేరకు ఆమె సోమవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

న్యూ ఢిల్లీ : బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నగారా మోగింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సోమవారం విడుదల చేసింది. రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపింది. నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయని, ఓట్ల లెక్కింపు నవంబర్ 14 న జరగనుంది. బీహార్‌లో మొత్తం 243 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22 తో ముగియనుంది. మొదటి దశలో 121 నియోజకవర్గాలకు నవంబర్ 6 న పోలింగ్ జరగనుంది. మిగిలిన నియోజకవర్గాలకు నవంబర్ 11 న పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 10 నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఇసిఐ తెలిపింది. నామినేషన్ దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 17, ఉపసంహరణకు చివరితేదీ అక్టోబర్ 20. ఓటర్ల జాబితా పై అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకుని, ఆగస్టు 1 న ఓటర్ల తుది జాబితా ప్రకటించామని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో సవరణలకు ఇంకా అవకాశం ఉందనీ ఆయన పేర్కొన్నారు. నామినేషన్లకు 10 రోజుల ముందూ ఓటర్ జాబితాలో మార్పులు చేసుకోవచ్చని సూచించారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈసారి ఎన్నికల ప్రక్రియ మరింత సులభతరం చేస్తున్నామని సీఈసీ వెల్లడించింది. బిహార్ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని సీఈసీ స్పష్టం చేసింది.

## నకిలీ మద్యం ఆరోపణ పై టీడీపీ నుంచి సస్పెండ్..

మొదటి పేజీ తరువాయి
తీసుకున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ మద్యం పై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నిందితుల పై కఠిన చర్యలు, నిష్పక్షపాత దర్యాప్తునకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తంబళ్లపల్లె టీడీపీ ఇంఛార్జ్ జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ సస్పెండ్ చేసింది. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధన్ రావుతో సహా 10 మందిని అరెస్టు చేయగా, తయారీ కేంద్రాన్ని గుర్తించారు. ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీ మద్యం తయారీ కేసును ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంలో నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అంతే కాదు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తంబళ్లపల్లె టీడీపీ ఇంఛార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడులను పార్టీ సస్పెండ్ చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ వ్యవహారంలో వారి పాత్ర పై విచారణ చేయాలని నిర్ణయించినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. నకిలీ మద్యం వ్యవహారం పై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఇందులో భాగంగా ములకల చెరువు నకిలీ మద్యం వ్యవహారం పై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు తెలిపారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు అని, ప్రజల ప్రాణాలకు చేటు చేసే నకిలీ మద్యం పై ఉక్కుపాదం మోపాలి. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం ములకల చెరువులో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి. ఈ కేసులో దీని పై అన్ని కోణాల్లో విచారణ జరిపి బాధ్యులైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి. నిందితులు ఎంతటి వారైనా వదలొద్దు అని చంద్రబాబు ఆదేశించారు. ములకల చెరువులో జరిపిన ఎక్సైజ్ శాఖ తనిఖీల్లో ముందుగా కొందరు వ్యక్తులు, నకిలీ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారు. వారిని విచారించి సేకరించిన సమాచారం అధారంగా ములకలచెరువు గ్రామంలో సోదాలు నిర్వహించాము. ములకల చెరువు సమీపం లోని కదిరినత్తునికోట గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడింది. నకిలీ మద్యం తయారు చేస్తున్న 14 మందిని గుర్తించి 10 మందిని అరెస్టు చేశాము. అలాగే, ఫేక్ లేబుల్స్, వివిధ బ్రాండ్ల నకిలీ మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నాము. ఎ 1 గా అద్దేపల్లి జనార్ధన్ రావు అనే వ్యక్తిని గుర్తించాము, అతనికి విజయవాడలో ఒక బార్ లైసెన్సు ఉంది. నకిలీ మద్యం దందాకు ములకలచెరువుకు వచ్చాడు. ఇక్కడ తయారైన మద్యాన్ని పెద్దతిప్పస ముద్రం లోని ఆంధ్రా వైన్స్, ములకల చెరువు లోని రాక్ స్టార్ వైన్స్‌లో విక్రయించారు. ఈ నకిలీ మద్యం తయారీలో ఇతనే ప్రధాన నిందితుడు, తమిళనాడుకు చెందిన నలుగురు వ్యక్తులను, ఒడిశాకు చెందిన వారిని కూడా నియమించుకున్నాడు. నకిలీ మద్యం సరఫరాకు ఓ డ్రైవర్‌ను కూడా నియమించుకున్నాడు అని అధికారులు సీఎంకు తెలియజేశారు.

# నేను ఓడిపోయినప్పుడు జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారు పవన్ కల్యాణ్

2019 లో తాను ఓడిపోయిన సమయంలో జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భాష, ప్రాంతంపరంగా వేరుగా ఉన్నా సంస్కృతి-సంప్రదాయాల విషయంలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలున్నాయన్నారు. కర్నాటక లోని చింతామణిలో జరిగిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల గౌడ 75 వ పుట్టినరోజు వేడుకల్లో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కోలార్, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి తమ వైపు నుంచి సహకారం అందిస్తామన్నారు. రూల్ ఆఫ్ లా స్థాపనలో నేటి తరానికి జస్టిస్ గోపాల గౌడ దారి చూపాలని కోరారు.

తన జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని, ఎన్నో కీలక కేసుల్లో ఆయన ఇచ్చిన తీర్పులు చరిత్రాత్మక౯మని గుర్తు చేశారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడేవారి పక్షాన నిలిచారని, ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినా అడ్డుకున్నారని తెలిపారు. జనసేన చేపట్టిన పోరా టాల్లో జస్టిస్ గోపాల గౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని, 2019 లో తాను ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేసుకు న్నారు. ఎపిలో పంట పొలాలు నాశనం కాకుండా కర్నాట క ప్రభుత్వం కుంకీ ఏనుగులు ఇచ్చి సహకరించిందని గుర్తు చేసుకున్నారు. శ్రీశైలం దేవస్థానా నికి వచ్చే కర్నాటక యాత్రికులకు సౌకర్యాల విషయంలో సానుకూ లంగా ఉన్నామని తెలిపారు. జస్టిస్ వి.గోపాల గౌడ మాట్లాడుతూ రైతులు, యువత, మహిళల అభ్యున్నతి గురించి పవన్ నిరంతరం ఆలోచిస్తారని తెలిపారు. కర్నాటక లోని మూడు జిల్లాల్లో నీటి సమస్య ఉందని, ఎపి సిఎం చంద్రబాబుతో మాట్లాడి పవన్ కల్యాణ్ ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

# దేశంలోనే రికార్డ్ ధర.. హైదరాబాద్‌లో ఎకరం రూ.177 కోట్లు

హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్?లో భూముల ధరలు కొత్త రికార్డ్ సృష్టించాయి. టీజీఐఐసీ నిర్వహించిన వేలంలో రాయదుర్గంలోని భూమి దేశంలోనే అత్యధిక ధర పలికింది. తద్వారా తన రికార్డ్?ను తానే హైదరాబాద్ బ్రేక్ చేసింది. గతంలో హైదరాబాద్?లోని కోకాపేటలో ఎకరం భూమి రూ.100 కోట్లు పలికి రికార్డ్ క్రియేట్ చేసింది.
తాజా వేలంలో ఈ రికార్డ్ బద్దలు అయ్యింది. కనీవినీ ఎరుగని రీతిలో రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర ఏకంగా రూ.177 కోట్లకు అమ్ముడుపోయింది. హైదరాబాద్?లో రియల్ ఎస్టేట్ రంగం డీలా పడిపోతుందని.. భూముల విలువ క్రమంగా తగ్గిపోతుందని ప్రచారం జరుగుతోన్న వేళ సిటీలో ఎకరం ధర ఏకంగా రూ.177 కోట్ల రికార్డ్ ధర పలకడం గమనార్హం.
రాయదుర్గంలోని ప్రభుత్వ స్థలాన్ని సోమవారం (అక్టోబర్ 6) టీజీఐఐసీ వేలం వేసింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలానికి అనూహ్య స్పందన లభించింది. భూమి దక్కించుకునేందుకు వేలంలో పలు సంస్థలు చివరి వరకు తీవ్రంగా పోటీ పడ్డాయి. ఎకరా ధరను టీజీఐఐసీ రూ.101 కోట్లుగా ఫిక్స్ చేయగా.. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ రికార్డ్ ధరతో భూమి దక్కించుకుంది. ఎకరాకు రూ.177 కోట్ల చొప్పున మొత్తం 7.6 ఎకరాల భూమిని రూ.1357 కోట్లకు సొంతం చేసుకుంది.

## వైద్య శాస్త్రంలో ముగ్గురిని వరించిన నోబెల్ బహుమతి

వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమన్ సకాగుచీకి అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. వైద్య విభాగంతో ప్రారంభమైన నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగుతాయి.మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకు గాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలుగా పేర్కొనబడే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు తమ పరిశోధనలు గుర్తించారు.

## మేడారంలో పనులు స్పీడప్.. సర్కార్ మాస్టర్ ప్లాన్ అమలు

- మొదటి పేజి తరువాయి
ఆదివాసీ సంప్రదాయాల మేరకు అమ్మవార్లకు గత నెల 30న పూజారులు ప్రత్యేక పూజలు చేసి భూమిపూజతో పనులకు అంకురార్పణ చేశారు. రెండు రోజలుగా పనులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ప్రాంగణంలోని చెట్లను తొలగిస్తున్నారు. కలెక్టర్? దివాకర టీఎస్? ప్రత్యేకంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇంజినీరింగ్?అధికారులు, మేడారం ఈవో, పూజారుల సమక్షంలో కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ సోమవారం ఆలయం చుట్టూ వాచ్?టవర్లను, పాత క్యూలైన్లను తొలగించారు. ఏండ్ల కింద నిర్మించిన మేడారం అమ్మవార్ల గద్దెల విస్తరణ, ఒకే లైన్ లో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మేడారం మహాజాతర 2026, జనవరి 28 నుంచి 31వరకు జరగనున్న నేపథ్యంలో వంద రోజుల్లో పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించారు. ఖర్గే అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. బెంగళూరులోని ప్రఖ్యాత ఎం.ఎస్. రామయ్య ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందిన అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఖర్గే శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న కారణంగా, ఆయన గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు వైద్యులు పేస్ మేకర్ ఇంప్లాంట్ ప్రక్రియ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెంగళూరుకు చేరుకున్నారు. పరామర్శ అనంతరం, వారి మధ్య రాజకీయ అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సుప్రీంకోర్టులో విచారణకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

## బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట.. పిటిషన్ కొట్టివేత

- మొదటి పేజి తరువాయి
విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టులో కేసు విచారణలో ఉండగా ఇక్కడికి ఎందుకు వచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. దీనికి న్యాయవాది బదులిస్తూ, హైకోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించిందని తెలిపారు. "అక్కడ స్టే ఇవ్వడానికి నిరాకరిస్తే ఇక్కడికి వస్తారా?" అని వ్యాఖ్యానించిన ధర్మాసనం, హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని చెబుతూ పిటిషన్‌ను తిరస్కరించింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని వంగా గోపాల్ రెడ్డి అనే వ్యక్తి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో మొత్తం కోటా 67 శాతానికి చేరిందని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. జీఓ నంబర్ 9ను తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ పిటిషన్‌లో మాధవరెడ్డి అనే వ్యక్తి, తీన్మార్ మల్లన్న కూడా ఇంప్లీడ్ అయ్యారు.కాగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీఓ నంబర్ 9ను జారీ చేసి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఈ జీఓ ఆధారంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9 నుంచి నవంబర్ 11 వరకు ఐదు దశల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇదే జీఓను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ఈ నెల 8కి వాయిదా పడిన విషయం తెలిసిందే.

# భారత నౌకా దళం లోకి మరో బ్రహ్మాస్త్రం

మొదటి పేజీ తరువాయి
యాంటీ- సబ్ మెరైన్ వార్ ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్(ఏఎస్డబ్ల్యు-ఎస్డబ్ల్యుసి) విభాగంలో ఇది రెండో జలాంతర్గామి. విశాఖపట్నం లోని నేవల్ డాక్ యార్డ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ అడ్మిరల్ రాజేశ్ పెండార్కర్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, ఈస్ట్రర్న్ నేవల్ కమాండ్ అధికారులు పాల్గొన్నారు. భారత నౌకాదళం మరో మైలురాయిని చేరుకుంది. ఐఎన్ఎస్ ఆండ్రోత్ ను జాతికి అంకితం చేశారు వైస్ అడ్మిరల్ రాజేశ్ పెండార్కర్. ఈ జలాంతర్గామిలో దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతిక వ్యవస్థలను అమర్చారు. ఐఎన్ఎస్ ఆండ్రోత్ భారత నౌకాదళంలోకి రావడంతో నౌకాదళ శక్తి, ఆత్మ నిర్భర భారత్ లో ముందడుగు వేసింది. ఐఎన్ఎస్ ఆండ్రోత్ ను తీరప్రాంత భద్రత, సెన్సార్స్ తో గస్తీ నిర్వహించేందుకు రూపొందించారు. ఐఎన్ఎస్ ఆండ్రోత్ పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యాంటీ- సబ్ మెరీన్ వార్ ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్డబ్ల్యు-ఎస్డబ్ల్యుసి) విభాగంలో రూపొందించారు. కోల్ కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జిఆర్ఎస్ఈ) సంస్థ ఈ జలాంతర్గామిని నిర్మించింది. ఈ యుద్ధ నౌకను 80 శాతానికి పైగా స్వదేశీ టెక్నాలజీతో నిర్మించారు. ఈ నౌక 77 మీటర్ల పొడవు, సుమారు 1,500 టన్నుల బరువు కలిగి ఉంది. ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక సెన్సార్లు, ఆయుధాలు, ప్రొపల్షన్ సిస్టమ్స్ ఈ జలాంతర్గామి సొంతం. అలాగే ఈ జలాంతర్గామిలో సోనార్ కమ్యూనికేషన్ వ్యవస్థ, సాగరిక క్షిపణులు సహా, రేడియేషన్ బయటకు రాకుండా భద్రతా ఏర్పాట్లు కూడా ఉన్నాయి. కోల్ కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) నౌకా నిర్మాణ సంస్థ ఈ జలాంతర్గామిని రూపొందించింది.
ఈ శ్రేణిలో ఇది రెండో యుద్ధనౌక మొదటిది ఐఎన్ఎస్ అర్నాలా. అది జూన్ 18 న లాంఛనంగా భారత నౌకాదళంలో చేరింది. లక్ష దీవుల్లోని అండ్రోత్ అనే ఐలాండ్ పేరును రెండో యుద్ధనౌకకు పెట్టారు. ఈ యుద్ధ నౌకలో దేశీయంగా తయారుచేసిన 30 ఎంఎం సర్ఫేస్ గన్ కూడా ఉంది. మొత్తం 16 జలాంతర్గాములను నేవీ ఆర్డర్ పెట్టింది. ఇందులో 8 నౌకలను జీఆర్ఎస్ఈ ఉత్పత్తి చేస్తోంది.

# గంగవరం మండల స్థాయి కో...కో సెలెక్షన్ విజేతలు

**గంగవరం, అక్టోబర్ 06 సీకే న్యూస్:**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గంగవరం మండలం లో జరిగిన కో..కో సెలెక్షన్ లు సోమవారం ముగిసింది.మామడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీలలో సీనియర్ బాయ్స్ విన్నర్ లుగా పత్తికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సీనియర్ గర్ల్స్ (అండర్ 17) విన్నర్ లు గా పొన్నమాకుల పల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాధించారు. సీనియర్ బాయ్స్ రన్నర్స్ గా జడ్పీ హైస్కూల్ పొన్నమాకుల పల్లె విద్యార్థులు,సీనియర్ గర్ల్స్ రన్నర్స్ గా పత్తికొండ విద్యార్థులు నిలిచారు.జూనియర్ గర్ల్స్ విన్నర్స్ గా జడ్పీ హైస్కూల్ జిఎల్ఎస్ ఫారం విద్యార్థులు సాధించారు. అదేవిధంగా జూనియర్ బాయ్స్ విన్నర్ లుగా పత్తికొండ,జూనియర్ బాయ్స్ (అండర్ 14) విభాగం లో రన్నర్స్ లు గా జడ్పీ హైస్కూల్ కొత్తపల్లి కాగా జూనియర్ గర్ల్స్ విభాగంలో రన్నర్స్ గా జడ్పీ హైస్కూల్ పత్తికొండ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు.ఇందులో ఆర్గనైజింగ్ టీం తరఫున పిడి లు మరియు ఉపాధ్యాయులు సురేష్,అజయ్,ఆజామ్, శశి ప్రకాష్,భానుమూర్తి,శ్రీనివాసులు, రమ,సూర్యప్రకాష్,పూర్ణిమ, హరి,సుధీన్,బాలు, ఖాదర్ వల్లి,శంకరయ్య లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన జెడ్పీ హైస్కూల్ మామడుగు ప్రధానోపాధ్యాయులు గణపతి నాయుడు,పిడి భాను మూర్తి,మండల ఏంఈవో వేణుగోపాల్ రెడ్డి, మండల కో ఆర్డినేటర్ టి.ఎస్.రమణలకు మండల పీడీలు అభినందనలు తెలిపారు.



## కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం వెంటనే నిలిపివేయండి

- జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా అనిత



**అక్టోబర్ 6 ( సీ కే న్యూస్)**జిల్లాలో చిన్నపిల్లలలో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.జి. హెచ్.ఎస్.), తెలంగాణ రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే ఆపాలని, సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎస్ఆర్-13 నుండి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వలన చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించడం జరిగిందని, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అనేక మంది పిల్లల మరణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు, ఫార్మసీ కేంద్రాలు, చిన్నపిల్లల వైద్యులు, ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదని, సిరప్ నిల్వలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో / టోల్ ఫ్రీ నం. 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభావిత బ్యాచ్ సిరప్ నిల్వలను గుర్తించి, నిలిపివేయడానికి ఫార్మసీలు, హోల్ సేల్ వ్యాపారులు, ఆసుపత్రులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న ఫార్మసీల వద్ద ఉన్న సిరప్ ల వివరాలు తీసుకోవాలని తెలిపారు. 2 సం॥ల వయస్సు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని, తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని, ఫార్మాసిస్టులు / డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.
మంచిర్యాల జిల్లా పౌరసంబంధాల అధికారిచే జారీ చేయనైనది

# స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జాబితాను సేకరించిన పార్టీ నాయకులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబరు 6.**భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్ అధ్యక్షతన,ఎన్నికల ప్రబారి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ చందా మహేందర్ గుప్తా గారు వలిగొండ మండల శాఖ కార్యాలయానికి విచ్చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను 1: 3 గా పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సేకరించి జిల్లా పార్టీ కార్యాలయానికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాది రెడ్డి గారు, పార్టీ జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, కనతాల అశోక్ రెడ్డి కందుల తానేష గౌడ్ మండల పదాధికారులు లోడే లింగస్వామి గౌడ్, గంగాధరీ దయాకర్, మందుల నాగరాజు, కొత్త రామ చంద్రం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న సీతయ్య చిత్రపటానికి నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు.



**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు వంకాయలపాటి చిన్న సీతయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి నివాళు లర్పించిన తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కమిటీ మాజీ అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథన్ మండల పార్టీ అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు మండల సహాయ కార్యదర్శి మేడా త్రివేణి గ్రామ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు కామేశ్వరరావు మల్లాది సుధాకర్ తదితర కార్యకర్తలు వారికి ఘనమైన నివాళులర్పించారు

# జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల అభ్యర్థుల ఖర్చు పరిమితులు.

## గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో అధికారుల సమీక్ష.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 06,**జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు మరియు రాజకీయ పార్టీలు ఖర్చు చేయగల వ్యయ పరిమితులను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి మరియు డీపిఒ రాంబాబు సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల ఖర్చు పరిమితులు మరియు వ్యయ పర్యవేక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.
సమావేశం లో మాట్లాడిన సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ, అభ్యర్థులు ఎన్నికల ఖర్చు పరిమితులను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం జెడ్పిటిసి అభ్యర్థులు రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.1.50 లక్షలు వరకు, సర్పంచ్ అభ్యర్థులు గ్రామపంచాయతీ జనాభా ఆధారంగా రూ.2.50 లక్షలు లేదా రూ.1.50 లక్షల వరకు వ్యయం చేయవచ్చని తెలిపారు.
2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.2.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.50,000ల వ్యయ పరిమితి, 5 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థికి రూ.1.50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థికి రూ.30,000ల వ్యయ పరిమితి ఉంటుందని వివరించారు.
డీపిఒ రాంబాబు మాట్లాడుతూ, అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ప్రచార ఖర్చులు కూడా ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖాతాలో చేర్చబడతాయని



తెలిపారు. ప్రచారంలో వాహనాలు, మైక్ సెట్లు, పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్లు మొదలైన వాటి ఖర్చులు కూడా లెక్కలో చూపించాలని సూచించారు.
ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల అనంతరం 45 రోజుల్లోపు తమ తుది ఖర్చు నివేదికలను సంబంధిత నియామక అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.
ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, ఖర్చు పర్యవేక్షణ కమిటీలు, వీడియో సర్వైలెన్స్ టీములు కఠినంగా పర్యవేక్షణ జరపనున్నాయని తెలిపారు.
ఈ సమావేశంలో డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్,ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లక్ష్మణ్ అగర్వాల్, భారతీయ రాష్ట్ర సమి తి అనుదీప్, సిపిఐ పార్టీ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ నోముల రమేష్, సిపిఐ ( ఎం) సత్యనారాయణ మరియు సిపిఐ ( ఎం సి ) గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొయచిలక గ్రామానికి చెందిన పసుపులేటివారి కుటుంబ సభ్యుల పై దౌర్జన్యానికి పాలు పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఎస్ఐ వీరేందర్.




**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.**తాగిన మైకంలో దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న కుటుంబం పై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్.
కోయ చిలక గ్రామానికి చెందిన పసుపులేటి కవిత వారి కుటుంబ సభ్యులు నిన్న పెనుగంచిపోలు దైవదర్శనానికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి సాయంత్రం బయలుదేరి వస్తుండగా పాతర్లపాడు గ్రామానికి చెందిన దిలీప్ మరియు శ్యామ్ ఇంకా కొంతమంది వ్యక్తులు కలిసి తాగిన మైకంలో వారి కారు వెంట వస్తూ నాగులవంచ దగ్గరికి రాగానే వారిని ఆపి తాగిన మైకంలో వారిని బూతులు తిట్టుకుంటూ మహిళలపై దౌర్జన్యం చేసినందుకు గాను పై వ్యక్తుల పైన కేసు నమోదు చేసి ఈరోజు వారి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడం జరిగింది.

# చిన్న సీతయ్య చిత్రపటానికి ఘన నివాళులు



**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ గ్రామానికి చెందిన సీనియర్ తెలుగు దేశం నేత నాగులవంచ మాజీ సర్పంచ్ వంకాయలపాటి చిన్న సీతయ్య దిన దిశ కర్మల సందర్భంగా వారి చిత్రపటానికి పూలేసి నివాళు లర్పించినారు ఈ కార్యక్రమంలో వివిసి ట్రస్ట్ అధినేత ఎండి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు అండ్ మత్కేపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు మండల కాంగ్రెస్ నాయకులు అడపా వెంకటరామ నరసయ్యఆలస్యం బసవయ్య దేవాలయ కమిటీ మెంబర్ ఎల్లంపల్లి చిన్న అప్పారావు యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం శంకర్రావు కాంగ్రెస్ నాయకులు నెల్లూరు రమేష్ కిలారి చంద్రశేఖర రావు తదితరులు పాల్గొని ఈ సందర్భంగాచిన్న సీతయ్య గ్రామానికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు

# వృత్తి ధర్మానికి నిలువుటద్దం డీసీహెచ్ఎస్ కేశగాని రాజశేఖర్ గౌడ్

- **ఉపాధ్యాయురాలికి ఆపన్నహస్తం౹ స్వయంగా ఆసుపత్రికి తరలించి చికిత్స పర్యవేక్షణ**
- **తన కారే అంబులెన్స్‌గా మార్చి రక్షణ అందించిన వైద్యుడు**

**సి కె న్యూస్ ప్రతినిధి** మానవత్వం ఇంకా బ్రతికే ఉందని నిరూపించారు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి డీసీహెచ్ఎస్ కేశగాని రాజశేఖర్ గౌడ్. ప్రమాదంలో గాయపడిన ఓ మహిళా ఉపాధ్యాయురాలిని చూసి క్షణం ఆలస్యం చేయకుండా స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. పెద్దగోపతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాధవి సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని ఖమ్మం బయలుదేరారు. మార్గమధ్యలో వి.వెంకటాయపాలెం గ్రామ స్టేజీ వద్ద ఆమె ప్రయాణిస్తున్న స్కూటీకి కుక్క అడ్డుగా రావడంతో స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె రక్తమోడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మీ సేవ నిర్వాహకురాలు నాగవాణి వెంటనే సిపిఆర్ చేసి కొంతమేర తేరుకునేలా చేశారు. అదే సమయంలో వైరా వైపు నుంచి కారులో వస్తున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ సంఘటనను గమనించి తన కారును ఆపి, స్వయంగా ఆమెను కారులో ఎక్కించుకొని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరగానే దగ్గరుండి ప్రథమ చికిత్స పూర్తి చేసి, అవసరమైన వైద్య సేవలు సమయానికి అందేలా పర్యవేక్షించారు. ఆయన వేగవంతమైన స్పందన వల్ల మాధవి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.



### గతంలోనూ పలు ప్రమాదాలపై స్పందన

రాజశేఖర్ గౌడ్ కేవలం ఈ ఒక ఘటనలోనే కాకుండా, గతంలో కూడా ఈ ఏరియాలో కొన్ని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించారు. కొద్ది నెలల క్రితం ఒక ప్రైవేట్ టీచర్ ఇలానే గాయపడి రోడ్డుపై పడిన సందర్భంలో స్వయంగా కారులో ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాద సంఘటనలో వయోవృద్ధుడికి తీవ్ర గాయాలుతగిలినప్పుడు కూడా తక్షణమే స్పందించి, అవసరమైన వైద్య సహాయం అందించారు. ఈ సంఘటనలు ఆయన తక్షణ, సమర్థ, మరియు మానవతా వైద్య సేవల్లో ముందుంటారని స్పష్టంగా చూపుతున్నాయి.

# అమ్మానాన్నలకు నామ ఘన నివాళులు



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాతృమూర్తి నామ వరలక్ష్మి ఐదవ వర్ధంతి సందర్భంగా, ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలోని నామ ముత్తయ్య - వరలక్ష్మి స్మృతివనంను సోమవారం నాడు నామ తన సోదరులు నామ సీతయ్య, నామ కృష్ణయ్య, సోదరి కమ్మ ధనమ్మ, కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మానాన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతకుముందు నెహ్రూనగర్ లో స్వగృహం వరలక్ష్మి నిలయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సాగర్ జలాల్లో పిండప్రదానం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో స్మృతివనం లో తన తల్లిదండ్రుల చిత్రపటాలను వీక్షించారు. తనకు ఎల్లప్పుడూ తల్లిదండ్రుల స్ఫూర్తి మార్గదర్శకమని నామ పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించి, విలువలతో జీవించారని గుర్తుచేశారు. అమ్మ త్యాగం, దాతృత్వం కుటుంబానికి ఆదర్శమని చెప్పారు. నామ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అనేక సంక్షేమ, సేవ కార్యక్రమాలు చేస్తున్న సంగతి మనందరికి తెలిసిందే.
ఈ కార్యక్రమంలో నామతో పాటు నామ తరుణ్, కనకమేడల సత్యనారాయణ, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, వనం నగేష్, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొని నామ ముత్తయ్య-వరలక్ష్మి విగ్రహాలకు పూలు జల్లి శ్రద్ధాంజలి ఘటించారు.

# తిరిగి ప్రారంభమైన పాఠశాలలు.



**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లో 6 నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు, పౌష్టికాహారం పిండి, గుడ్లు, అందించి, పిల్లలకి ఎత్తు, బరువు,కొలతలను చూశారు.
ఈ కార్యక్రమంలో.. జగన్నాథపురం అంగన్వాడి టీచర్ కాసిమాల వెంకమ్మ, ఆయా యాత్రమల పద్మ, పిల్లలతల్లిలు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత.. పోలీసుల అదుపులో నిందితులు...

- పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి



పెబ్బేరు అక్టోబర్06 (సి కే న్యూస్)హైదరాబాదు నుండి బెంగళూరుకు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పెబ్బేరు పోలీసులు పట్టుకున్నారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో పెబ్బేరు ఎస్ఐ యుగంధర్ రెడ్డి సోమవారం పోలీస్ సిబ్బందితో వద్ద ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. పెబ్బేరు బస్టాండులో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని పట్టుకొని విచారించగా అతని దగ్గర ఉన్న బ్యాగులో 2లక్షల విలువైన 4కిలోలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే బెంగళూరుకు చెందిన మల్లేష్(25) అతని స్నేహితులైన దిలీప్ కాళీ ఇద్దరు కలిసి మోహన్ మరియు అర్జున అనే వ్యక్తుల దగ్గర ఒరిస్సాలో గంజాయిని కొని వారు బెంగుళూరు తీసుకెళ్లి కస్టమర్లకు ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నామని పోలీసుల విచారణలో తెలిపారు. దిలీప్ అనే వ్యక్తి మధ్యలోనే దిగి పని ఉందని వెళ్ళినట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు

## నిర్విరామ సేవలకు ప్రత్యేక కృతజ్ఞతలు...

- జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ
- ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారిణి



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన సిబ్బందికి జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారిణి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెప్టెంబర్ నెలలో పదవీ విరమణ పొందిన సిబ్బంది కోసం సోమవారం ప్రజావాణి అనంతరం ఏర్పాటు చేసిన రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసి అభివృద్ధి శాఖ పరిధిలో సహాయ బీసి అభివృద్ధి అధికారిగా పని చేసిన ఎం. ఈదయ్య, వెటర్నరీ శాఖలో ఆఫీస్ సబార్డినేట్ జి. సావిత్రి పదవీ విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని, మనకు గుర్తింపు ఉద్యోగం నుంచి లభిస్తుందని అన్నారు. 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయమని, ప్రజలకు వివిధ రంగాలలో దశాబ్దాల కాలంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన సహాయ బిసి అభివృద్ధి అధికారి ఎం. ఈదయ్య మాట్లాడుతూ బీసీ అభివృద్ధి శాఖలో హాస్టల్ సంక్షేమ అధికారిగా విధులలో చేరి నేడు సహాయ బిసి అభివృద్ధి అధికారిగా 5 సంవత్సరాల నుంచి పని చేస్తూ నేడు పదవి విరమణ పొందడం సంతోషంగా ఉందని అన్నారు. హాస్టల్స్ నిర్వహణ, తనిఖీ, వివిధ సంక్షేమ పథకాల అమలులో బీసీ అభివృద్ధి అధికారి సూచనలు మేరకు పనిచేయడం జరిగిందని అన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వెటర్నరీ శాఖలో ఆఫీస్ సబార్డినేట్ గా పదవీ విరమణ పొందిన జి. సావిత్రి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా తాను వెటర్నరీ శాఖలో పని చేస్తున్నానని, తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డిఆర్ఓ పదవీ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, వెటర్నరీ అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భర్త చేతిలో భార్య హత్య..!!



సికె న్యూస్ ప్రతినిధి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలము కాలనీ గ్రామ నివాసి ధరావత్ గోపీ తన భార్య అయిన సునీత ను అనుమానంతో అతికిరాతకంగా చంపి పత్తి చేలో పడేసి నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగిపోయిన ధరావత్ గోపి వయసు 40 మృతురాలు సునీతకు ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న జూలకపాడు పోలీసులు విచారణ చేపట్టారు హత్యకు గల కారణాలు వివరాలు తెలియాల్సిన ఉంది.

# ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, అక్టోబర్ -06: ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు జిల్లా అధికారులు తమ వద్ద పెండింగ్ లేకుండా చూడాలని, దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని అన్నారు.

ఖమ్మం నగరం వినోబా నవోదయ కాలనీవాసులు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం భూదాన యజ్ఞ బోర్డు ఇచ్చిన స్థలంలో నివాసాలు ఏర్పరచుకున్న పేద ప్రజలకు విద్యుత్, మంచినీటి వసతి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగంకు రాస్తూ ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్ అన్నారు.

మధిర మండలానికి చెందిన ఊటుకూరు రూతమ్మ, తమకు ప్రభుత్వం ఇచ్చిన ఎకరం భూమికి పట్టా పాస్ పుస్తకం జారీ చేసి రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ మధిరకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

వైరా మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఎం. రాధ తమకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని బేస్మెంట్ వరకు నిర్మించుకున్నామని గ్రామంలో ఉన్న మిగతా లబ్ధిదారులకు డబ్బులు వచ్చాయని, 2 నెలలు గడిచిన తనకు బిల్లు డబ్బులు రాలేదని ఇందిరమ్మ మొదటి బిల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన భీమిరెడ్డి పుల్లారెడ్డి ఎన్టీఆర్ కాలువ మధ్యలో సంచార జాతులకు చెందిన వారు సొంత స్థలాల్లో డేరాలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి అవసరమైన డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పంచాయతీ రాజ్ ఏఈకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

సత్తుపల్లి మండలానికి చెందిన నాగమణి తనకు ఒంటరి పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి పై కేంద్ర ప్రభారి అధికారిసోలామన్ అరోకియా రాజ్ సమీక్షా సమావేశం



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 06,ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించడానికి, కేంద్రప్రభారి అధికారి సోలామన్ అరోకియా రాజ్ ఐఏఎస్, అదనపు కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల శాఖ, సోమవారం జిల్లా పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన జిల్లా ప్రధాన కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ, మహిళా మరియు ఇతర అభివృద్ధి సంబంధిత కేంద్రాలను పరిశీలించిన తర్వాత, ఐడిఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. విద్యా రంగంలో ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు పర్యవేక్షణతో అందించడం, పాఠశాలల్లో ఔషధ మొక్కల పెంపకం, విద్యా ప్రమాణాలను పెంపొందించే చర్యలు చేపట్టడం వంటి విషయాలను కలెక్టర్ వివరించారు. ఆరోగ్య రంగంలో తల్లి-పిల్లల ఆరోగ్యం, నూతన బ్లడ్ బ్యాంకుల స్థాపన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మేళవించిన వైద్య సేవల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో మునగా, వెదురు అజోల్ల, పుట్టగొడుగుల సాగు, చేపల పెంపకం యూనిట్లు, బయోచార్ తయారీ ఫామ్ పౌండ్ల నిర్మాణం వంటి పథకాల అమలు, అశ్వరావుపేటలో జీవ వనరుల కేంద్రం ఏర్పాటు మరియు మహిళా సంఘాల అభివృద్ధికి కల్పిస్తున్న సదుపాయాలపై స్పష్టంగా వివరించారు.

సమావేశంలో కేంద్రప్రభారి అధికారి సోలామన్ ఆరోకియా రాజ్ ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ నిరంతరం పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయవలసిన అవసరం ఉన్నదని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒక ఆకాంక్షిత జిల్లా కాబట్టి, ప్రతి అభివృద్ధి సూచికపై సమగ్ర దృష్టి పెట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విధంగా కార్యాచరణ కొనసాగించాల్సినదని స్పష్టంగా పేర్కొన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక లభ్యత.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కూపన్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా
- మధిర నియోజకవర్గ పరిధిలో ఇసుక లభ్యతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సమృద్ధిగా ఇసుక అవసరమైన స్థాయిలో లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ లోని తన చాంబర్ లో సోమవారం మధిర నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో ఇసుక లభ్యతపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరాకు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల నుండి ఇసుక లభ్యత సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్ తెలిపారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని, ప్రతి మండల స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మేర ఇసుక అందుబాటులో పెట్టాలని, అదే సమయంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన మేర ఇసుకను సంబంధిత మండల ఇంజనీరు సిఫార్సు మేరకు తహసిల్దార్ కూపన్ జారీ చేసి ఇసుక సరఫరా చేయాలని అన్నారు. ఇసుక సరఫరాలో మండల స్థాయిలో ఉన్న సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించి పరిష్కరించాలని అన్నారు.

ప్రతి మండల కేంద్రంలో స్థానిక అవసరాల మేరకు అవసరమైన ఇసుకను డంప్ చేయాలని అన్నారు. ఇసుక డంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఇసుక డంప్ నుంచి అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు.

ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, తహసిల్దార్ లు, ఎంపీడీఓ లు, హౌసింగ్ ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల రీడింగ్ స్కిల్స్ పెంపుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 5 పాఠశాలల్లో పిల్లలకు రీడింగ్ సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ట్రయల్ రన్
- %జుజవతీఎ జష్ట్రఱశ్రీస =ఝుసం% కార్యక్రమంపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, పిల్లల రీడింగ్ స్కిల్స్ పెంపుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరెట్ లోని తన చాంబర్ లో సోమవారం %జుజవతీఎ జష్ట్రఱశ్రీస =ఝుసం% కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళే ప్రతి విద్యార్థికి తప్పని సరిగా చదివే సామర్థ్యం అందే దిశగా %జుజవతీఎ జష్ట్రఱశ్రీస =ఝుసం% కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. చింతకాని మండలంలో ఎంపిక చేసిన 5 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద పిల్లలకు రీడింగ్ సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన యాప్ ట్రయల్ రన్ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి రోజూ %జుజవతీఎ జష్ట్రఱశ్రీస =ఝుసం% కార్యక్రమం క్రింద ఉపాధ్యాయులు ప్రత్యేక ఫోకస్ పెట్టి పిల్లలు చదివే సామర్థ్యం పెంపుదలకు కృషి చేయాలని, ప్రతిరోజు మధ్యాహ్నం 3.00 నుంచి 4.00 గంటల వరకు ఒక పీరియడ్ రీడింగ్ సామర్థ్యం కోసం కేటాయించాలని, నేటి (మంగళవారం) నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా రీడింగ్ స్కిల్ అందాలని, పిల్లలు చదవడంతో పాటు చదివింది అర్థం చేసుకునే గ్రహణ శక్తి పెంపొందించేలా మన బోధన ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి. హెచ్. రామకృష్ణ, సిఎంఓ ప్రవీణ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ం

## నేడు లచ్చ గూడెం గ్రామంలో టిఆర్ఎస్ మండల సమావేశం



సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.మంగళవారం ఉదయం 10 గంటలకు చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ మండల సమావేశం జరుగును ఈ సమావేశానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మధిర టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు పాల్గొంటున్నారు కావున అన్ని గ్రామ శాఖలో అందరూ తప్పక రాగలరని కోరుచున్నాము సర్పంచులు ఎంపిటిసిలు రైతుబంధు అధ్యక్షులు ముఖ్య కార్యకర్తలు ముఖ్య నాయకులు అందరూ తప్పక రాగలరు చింతకాని మండల కమిటీ టిఆర్ఎస్ పార్టీ

# అక్టోబర్ 8 లోపు బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు దాఖలు.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం,** అక్టోబర్ 8 లోపు స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జెడ్పిటిసి ) బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్డర్ ఇచ్చిన 4 రోజుల లోపు బ్యాలెట్ పేపర్ల ముద్రణ చేయాలని, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన సింబల్ బ్లాక్స్, పింక్, వైట్ పేపర్ మొదలైనవి సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు.

బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆసక్తి గల వారు జెడ్పి సీఈఓ వద్ద 5000 రూపాయల డిడి చెల్లించి టెండర్ ఫారం తీసుకోవాలని, ఆసక్తి గలవారు 50 వేల రూపాయల డిడితో కలిపి టెండర్ ఫారం అక్టోబర్ 8 లోపు సమర్పించాలని, అక్టోబర్ 8 సాయంత్రం 4.00 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో టెండర్ ఓపెన్ చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్ట్రాంగ్ రూం లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం,** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లా కలెక్టర్, కొనిజర్ల మండలం తనికెళ్ళ గ్రేసీ కాలేజ్, ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, బారుగూడెం లోని మహ్మదీయ కళాశాలల నందు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి పరిశీలించారు. స్థానిక సంస్థలకు ఎన్నికల తర్వాత భద్రత, స్ట్రాంగ్ రూమ్ లలో పోలీసు బందోబస్తు, సీసీ కెమెరా ఏర్పాటు, పార్కింగ్ ఏరియా, కిటికీలకు తలుపులకు జాలీల అమరిక, వర్షం వలన ఏలాంటి జల్లు రాకుండా మరమ్మత్తులు, సరిపడా లైటింగ్ పటిష్టమైన ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, గ్రేసీ కళాశాల లో కొణిజర్ల, వైరా, చింతకాని మండలాలు, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల నందు సింగరేణి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాలు, మహ్మదీయ కళాశాల నందు తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

ఈ పర్యటనలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, అదనపు డిసిపి ప్రసాద రావు, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో మొదలైన రాజకీయ చదరంగం..

పల్లెల్లో స్థానిక ఎన్నికల హడావుడి




**సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి.** రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాలకు రావటంతో బరిలో దిగే వారికి గాలం...

నీ దగ్గర డబ్బులు లేవా .. పెట్టుబడి పెడతాం కానీ పెత్తనం మాత్రం మాదే...

బినువ్వు కేవలం అభ్యర్థి మాత్రమే రాజకీయం మాత్రం మేమే చేస్తాం..

పార్టీతో సంబంధం లేదు నీ పని నిలబడటమే తరువాత అంత నడిపించేది కూడా మేమే...

రిజర్వేషన్ మరుతాయా లేదా అనేది మాకు అనవసరం...

చివరికి అభ్యర్థులు ఏవరు అనేది కూడా డిసైడ్ చేస్తున్నా డబ్బు రాజకీయం..

రాజకీయ కోణంలో కాకుండా డబ్బు రాజకీయాలతో చదరంగం అడుతున్న పలు పార్టీలు...

చివరి వరకు పార్టీలో పనిచేసి డబ్బులు లేక ఆలోచనలో పడ్డ అభ్యర్థులు..

కనుమరుగవుతున్న విలువలతో కూడిన రాజకీయాలు, అభివృద్ధి చెందుతున్న డబ్బు రాజకీయాలు...

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఐకాన్ గా నిలువాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మెరుగైన వనరుల ఏర్పాటుతో భావితరాలకు నాణ్యమైన విద్య
- చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించేలా విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పన
- జిల్లా లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పురోగతి పనులపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఐకాన్ గా నిలువాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు

కలెక్టరేట్ లోని తన చాంబర్ నందు జిల్లాలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనుల పై సోమవారం టిజిఇడబ్ల్యూఐడిసి సిఇ షఫీమియా తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. భవనాల నిర్మాణ పురోగతి పనుల నమూనా మ్యాప్ లను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కూల్ సముదాయానికి చేరుకునే అప్రోచ్ రోడ్ల పనులు, తాగునీటి వసతి, పార్కింగ్, విద్యుదీకరణ, సబ్ స్టేషన్ ఏర్పాటు, టాయిలెట్లు, క్రీడా ప్రాంగణం, పైపులైన్, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులు, అంతర్గత రోడ్లు, వసతి గృహాలు, 3000 మంది విద్యార్థులు, స్టాఫ్ కు సరిపడ వసతుల కల్పనకు నాణ్యతతో యుద్ధప్రతిపాదన పనులు కొనసాగిస్తూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా ఇంటిగ్రేటేడ్ పాఠశాలలో చదివే విద్యార్థులను తీర్చిదిద్దబడతారని తెలిపారు. పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూర్చే వరప్రదాయినిగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిలుస్తాయిని అన్నారు. ఈ సమీక్ష లో పీఆర్ ఎస్ఇ జి. వెంకటరెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ 2 ఉద్యోగం సాధించిన సాయిభార్గవ్ ను సన్మానించిన మాజీ జడ్పీటీసీ దిరిశాల ప్రమీల..



**తల్లాడ అక్టోబర్ 6 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో డిప్యూటీ తహశీల్దార్ ఉద్యోగం సాధించిన తల్లాడ మండలంలోని కలకోడిమ గ్రామానికి చెందిన వద్దే రమేష్ బాబు, రజిని దంపతుల కుమారుడు సాయి భార్గవ్ ను తల్లాడ మాజీ జడ్పిటిసి దిరిశాల ప్రమీల, బీఆర్ఎస్ పార్టీ జోనల్ చైర్మన్ దిరిశాల దాసురావు సన్మానించారు. సోమవారం ఆ గ్రామంలో ఆయనను శాలువాలతో సన్మానించి సత్కరించారు. వద్దే భార్గవ్ సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. చిన్ననాటి నుండి చదువులో రాణిస్తూ గురుకులాలో విద్యాభ్యాసం చేశారు. గతంలో గ్రూప్ 4 ఉద్యోగం రాసి జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరలా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి గ్రూప్–2 రాయడంతో డిప్యూటీ తహశీల్దార్ గా ఉద్యోగం సాధించారు. తమ గ్రామానికి చెందిన యువకుడికి ఉద్యోగం రావడం పట్ల ప్రమీల దంపతులు అభినందనలు తెలిపారు. విదేశాల్లో చదవాలనే తల్లిదండ్రుల కోరిక ఉన్నప్పటికీ ఆ యువకుడు మాత్రం స్వదేశంలోనే ఉద్యోగం సాధించి సేవ చేయాలనే తలంపు ఉండటంతో ఇక్కడే చదివి ఉద్యోగం సాధించినట్లు సాయి భార్గవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామస్తులు తాళ్లూరి నాగభూషణం, తాళ్లూరి చిన్నా, ఆదూరి మారతమ్మ, కృష్ణ, గోళ్ల ఐతమ్ రాజు, తేల్లూరి మల్లయ్య తదితరులు ఉన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాడుదాం

**నెల్లూరు జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

**నెల్లూరులో రౌండ్ టేబుల్ సమావేశం**

**నెల్లూరు జిల్లా: సికె న్యూస్ ప్రతినిధి** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని నెల్లూరు జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని డి.ఆర్.ఉత్తమ్ హోటల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. %–% ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించే బాధ్యత ప్రధాన ప్రతిపక్షాలపై ఉంటుంది. పోరాటాలకు, విమర్శలకు పరిమితం కాకుండా, సమాజం పట్ల అందరం బాధ్యత వహించాలి. విద్య, వైద్యం అనేవి ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కు అని మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారు రాజ్యాంగంలో రాశారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిత్యం పర్యవేక్షించారు. నాడు నేడు పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత వైయస్ జగన్‌ది. కోవిడ్ లాంటి దురదృష్టకర పరిస్థితిలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడుకున్నారు.

వైయస్ జగన్ కోవిడ్ లాంటివి విపత్కర పరిస్థితిని చూసి రాష్ట్రంలో ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రులను నెలకొల్పాలని నిశ్చయించుకున్నారు. వైయస్ జగన్ రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొనివచ్చారు. వైయస్ఆర్‌సీపీ హయాంలోనే 7 మెడికల్ కాలేజీలు పూర్తయ్యి, 5 మెడికల్ కాలేజీలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యి, మిగిలినవి వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి. వైయస్ జగన్ తీసుకుని వచ్చిన 17 మెడికల్ కాలేజీల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించే అవకాశం లభించింది. చంద్రబాబు ప్రజల సొమ్మును ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నాడు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని వర్గాల సంఘాలు వ్యతిరేకిస్తున్నా, ప్రభుత్వం భేరసారాలు చేస్తుంది తప్ప, విరమించుకునే ఆలోచన చేయడం లేదు. దేశంలో పలు రాష్ట్రాలలో మెడికల్ విద్య ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తూ, తిరుగుబాటు చేయడంతో ఆయా ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. చంద్రబాబు కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను ఎకరం వంద రూపాయలకు ప్రైవేట్ పరం చేస్తున్నాడు. చంద్రబాబు ఎవరి ప్రలోభాలకు గురై ప్రభుత్వం మెడికల్ కాలేజీ లను ప్రైవేట్ పరం చేసేందుకు ఆలోచన చేస్తున్నాడో అన్నది సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రశ్న. విద్యారంగం ప్రైవేట్ పరం కావడం వలన, విద్య వ్యాపారంగా మారిపోయింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ధర్నాలు, పోరాటాలు చేస్తే పోలీసులు షరతులు విధిస్తూ, నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

అన్ని వర్గాల సంఘాలు పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రజా సంఘాలు, పౌరహక్కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ఆచార్యులు, మేధావులు, విద్యావేత్తలు, చట్టసభలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులను కలుపుకొని వెళ్లి, వారి సూచనలు, సలహాలు తీసుకొని ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకుంటాం. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విషయంలో మా పోరాటం కొనసాగిస్తాం. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటుచేస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పేద ప్రజలకు మేలు కలగడమే లక్ష్యంగా, ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు– కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

# జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**తాడేపల్లి: సీకే న్యూస్ ప్రతినిధి** సనాతన ధర్మం ముసుగులో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితుడిని కఠినంగా శిక్షించి న్యాయ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా చూడాలని శింగనమల నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకె శైలజానాథ్ డిమాండ్ చేశారు.

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా దళితులను చిన్నచూపు చూస్తూనే ఉన్నారని, ఉన్నత స్థానంలో ఉంటే ఇప్పటికీ కొందరు చూసి ఓర్చలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. సనాతన ధర్మం ముసుగులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద కోర్టు హాల్‌లో ఒక లాయర్ షూ విసరడానికి ప్రయత్నించడాన్ని సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయాధిపతిగా దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి మీద జాత్యహంకారంతో దాడి చేయాలని చూడటం క్షమించరాని తప్పుగా

చూడాలన్నారు. దీన్ని దేశప్రజలంతా తీవ్రంగా ఖండించాలని చెప్పారు. ఉన్నత స్థానంలో ఉన్న సుప్రీం చీఫ్ జస్టిస్ మీదనే దాడి చేయడానికి ప్రయత్నించారంటే సామాన్యుడి పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదని మాజీ మంత్రి శైలజానాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలను తగ్గించి చూపించే ప్రయత్నం చేయడం దేశానికి అంత మంచిది కూడా కాదని ఆయన అభిప్రాయపడ్డారు. భాష, ప్రాంతం, కులం, మతం పేరుతో ఇతరులపై దాడి చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## వర్షాకాలంలో గొంతు మారుతోందా.. ఏం చేయాలంటే?

వర్షాకాలం వేళ జలుబు.. దగ్గు.. గొంతు నొప్పి చాలామంది ఫేస్ చేస్తుంటారు. ఈ సందర్భంగా వారి గొంతు (వాయిస్) లో మార్పు వస్తుంది. స్వరపేటిక వాపు.. గొంతు గరగర.. బొంగురుపోవటం.. తడారటం.. గొంతులో నొప్పి లాంటివి ఎదురవుతుంటాయి. నాలుగైదు రోజుల పాటు ఇలాంటి సమస్యలు ఎదురైతే ఫర్లేదు కానీ.. వారాల తరబడి అదే సమస్య వెంటాడుతుంటే మాత్రం అస్సలు లైట్ తీసుకోవద్దని.. వెంటనే ఈఎన్ టీ వైద్యుల్ని సంప్రదించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వర్షాల్లో తడిచినా.. చల్లటి వాతావరణంలో తిరిగినా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఇన్ఫెక్షన్లు తలెత్తుతాయి. జీర్ణవ్యవస్థలో లోపాలతోనూ కడుపులోకి యాసిడ్ గొంతులోకి వచ్చి కూడా వాయిస్ మారే ఛాన్స్ ఉంది. ఇలాంటి వేళ కొన్ని చిట్కాల్ని పాటిస్తే మంచిదన్న సూచన చేస్తున్నారు నిపుణులు. విటమిన్ సి పుష్కలంగా ఉన్న నారింజ.. బొప్పాయి.. నిమ్మ.. కివీ లాంటి పండ్లు రోజువారీ ఆహారంలో తీసుకోవటం.. టమాటా.. ద్రాక్ష.. అరటి.. క్యారెట్.. ఉల్లి లాంటి పదార్థాల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఎలర్జీ తగ్గించటంలో సాయం చేస్తాయని చెబుతున్నారు. గోరు వెచ్చని గ్లాసు నీళ్లలో అరచెంచా ఉప్పు వేసి బాగా కలిపి.. తరచూ పుక్కిలిస్తే కూడా ఉపశమనం పొందే వీలుందని.. ఇలా చేయటం ద్వారా యాంటీ మైక్రో బయల్ ప్రభావంతో ఇన్ ఫెక్షన్ తగ్గే వీలుందని చెబుతున్నారు. అల్లంటీ.. గ్రీన్ టీ.. తేనె.. తులసిరసం తీసుకోవాలని చెబుతున్నారు తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్.. యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు గొంతు వాపును తగ్గిస్తాయి. శరీరంలో నీటి శాతం తగ్గినా గొంతు మీద ప్రభావం పడుతుందని.. అందుకే రోజుకు ఏడెనిమిది గ్లాసుల నీళ్లు తాగాలని చెబుతన్నారు. శీతాకాలంలో కారం.. పులుపు.. మసాలా ఆహారాలు తగ్గించాలని చెబుతున్నారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. మారిన గొంతు మామూలు స్థితికి రాకుంటే మాత్రం ఈఎన్ టీ వైద్యులను సంప్రదించి.. వారి సూచనల్ని పాటించాల్సిన అవసరం ఉందన్నది మర్చిపోకూడదు.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు

వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40–50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.



**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



**35 శాతం మందికి బీపీ**


**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా ఫలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

# అనుష్క బయటకొచ్చేది డిసెంబర్లోనా!



ఘాటీ - సినిమా చేసినా? ఆ సినిమా ప్రచారంలో అనుష్క పాల్గొనలేదు. అందుకు కారణాలేంటి? అంటే రకరకాలు తెరపైకి వచ్చాయి. కానీ నిర్మాతలు మాత్రం అనుష్కతో ముందే ప్రచార పరంగా పాల్గొనదు అనే విషయాన్ని తను ముందే చెప్పిందని...ఆ విషయంలో తనకు అన్ని రకాలుగా సహకరించినట్లు తెలిపారు. కానీ ఓ లేడీ ఓరియేంటెడ్ సినిమా చేసి అనుష్క ప్రచారంలో పాల్గొనలేదు? ఏంటి? అన్న దానిపై ఎవరి సందేహాలు వారివి. సహజంగా ఓ పెద్ద నటి ప్రచారంలో పాల్గొనకపోతే పాజిటివిటీ కంటే నెగివిటీనే ఎక్కువ స్ప్రెడ్ అవుతుంది.

**పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఆ చిత్రం:**

ఈ అంశంపై సోషల్ మీడియా సహా మెయిన్ స్ట్రీమ్ మీడియాలోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అనుష్క మీడియా కంట పడకుండా తప్పించుకుని తిరుగుతందా? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇదంతా గతం. మరి స్వీటీ మళ్లీ బయటకు వచ్చేది ఎప్పుడు? అంటే డిసెంబర్ లో అందుకు అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం అనుష్క మలయాళంలో  కథనార్ - చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింద.ఇ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రిలీజ్ తేదీ ఇంకా వెల్లడించలేదు.

**మాలీవుడ్ ప్రేక్షకుల ముందు కొస్తుం దా:**

ఇదే ఏడాది రిలీజ్ అవుతుందా? వచ్చే ఏడాది రిలీజ్ అవుతుందా? అన్న దానిపై సందేహాలున్నాయి. కానీ మాలీవుడ్ మీడియాలో డిసెంబర్లో రిలీజ్ ఉంటుందనే వార్త వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఆ సినిమా ప్రచారంలో అనుష్క భాగమవుతుందా? %-%ఘాటీ%-% తరహాలో స్కిప్ కొడుతుందా? అన్న సందేహాలు లేకపోలేదు. కానీ మాలీవుడ్ లో అనుష్క తప్పక బయటకు రావాల్సిన సమయం ఇది. %-%కథనార్%-% అనుష్క మాలీవుడ్ డెబ్యూ. పైగా పాన్ ఇండియా రిలీజ్క. ఆరంభ చిత్రం ప్రచారంలోనే అనుష్క మీడియా కంట పడలేదంటే? అక్కడా నెగిటివిటీ తప్పదు.

**అక్కడ అనుష్క నిర్ణయం ఎలా:**

హీరోయిన్ లేని ప్రచారాన్ని మాలీవుడ్ ప్రేక్షకులు అంగీకరించరు. పరిశ్రమ పరంగానూ మాలీవుడ్ చిన్నది. తమిళ, తెలుగు భాషల్లోనూ మార్కెట్ చేయాలంటే? అనుష్క ప్రచారం చేస్తే రీచ్ ఎక్కువగా ఉంటుంది. ప్రేక్షకులకు సులభంగా కనెక్ట్ అవుతుంది. ఇందులో హీరోగా నటిస్తోంది జయసూర్య. అతడి మాలీవుడ్ వరకే పరిమితం. ప్రభుదేవా మరో హీరోగా నటిస్తున్నా? స్టార్ హీరో కాదు. ఈ రెండు కోణాల్లో చూస్తే అనుష్క ప్రచారం సినిమాకు కోట్ల రూపాయల పబ్లిసిటీని అందించినట్లే. మాలీవుడ్ లోనూ తనను తాను వ్యక్తిగతంగా ప్రమెట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరి మేకర్స్ అనుష్క విషయంలో ఎలా ముందుకెళ్తారు? అన్నది చూడాలి.

# డెబ్యూతోనే స్టార్ హీరో వారసుడు ఓ సంచలనం!



బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ %-%బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్%-% తో డైరెక్టర్ గా పరిచయమైన సంగతి తెలిసిందే. ఇటీవలే ఆ వెబ్ సిరీస్ తొలి ఎపిసోడ్ నెట్ ఫ్లిక్స్ లో విడుదలైంది. మొదటి ఎపిసోడ్ కి నాట్ బ్యాడ్ అనే రివ్యూ వచ్చేసింది. మేకింగ్ పరంగా పర్వాలేదనిపించాడు. ఫిల్మ్ స్కూల్స్ లో నేర్చుకున్న అనుభవంతో ఆర్యన్ ఖాన్ బాగానే డీల్ చేసాడు. భవిష్యత్ లో మంచి డైరెక్టర్ అవుతాడు? అన్న నమ్మకం బాలీవుడ్ కి కలుగుతోంది. షారుక్ ఖాన్ నమ్మకం కూడా బలపడింది. తనయుడు క్రియేటివ్ రంగంలో రాణిస్తాడా? లేదా? అన్న సందేహం రిలీజ్ ముందు వరకూ షారుక్ లో కనిపించేది. హీరోగా ఎంట్రీ ఇవ్వకుండా అనవసరంగా రిస్క్ తీసుకుంటున్నాడా? అన్న ఆందోళనలో షారుక్ లో కనిపించేది. కానీ తొలి ఎపిసోడ్ తో గుర్తింపు రావడంతో షారుక్ రిలాక్స్ అవుతున్నాడు. ఇదంతా పక్కన బెడితే? తొలి సీజన్ తోనే ఆర్యన్ ఖాన్ అన్ని మాద్యమాల్లోనూ హాట్ టాపిక్ గా మారాడు. సాధారణంగా ఇంతటి హైప్ ఎవరికీ రాదు. కానీ ఆర్యన్ ఖాన్ కి సాధ్యమైంది? అంటే అందుకు ప్రత్యేక కారణం ఎవరో చెప్పాల్సిన పనిలేదు. అతడే సమీర్ వాఖండే. డ్రగ్స్ కేసులో ఆర్యన్ ఖాన్ మాజీ నార్కోటెక్స్ అధికారి సమీర్ వాఖండే చేతుల్లోనే పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ సీజన్ రిలీజ్ అయిన అనంతరం సమీర్ తనని...న్యాయ వ్యవస్థని టార్గెట్ చేసి సీరిస్ రూపొందించదని చేసిన ఆరోపణలు దేశ వ్యాప్తంగా ఎంతో సంచలనమైందో తెలిసిందే. ఈ ఒక్క ఘటనతో %-%బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్%-% దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. సిరీస్ లో ఏముందో చూడాలి? అన్న ఆసక్తి అందరిలో మొదలైంది.సాధారణంగా తెలుగు ఆడియన్స్ ఇలాంటి సిరీస్ ల పట్ల పెద్దగా ఆసక్తి చూపించరు. కానీ సీన్ లోకి సమీర్ వాఖండే రావడంతో? అతడి గురించి ఆర్యన్ ఖాన్ ఏం చెప్పాడో చూద్దాం అన్న ఆసక్తి మొదలైంది. ఆర్యన్ ఖాన్ సిరీస్ గురించి చేసిన ప్రచారం కంటే సమీర్ వాఖండే కోర్టులో కేసులు వేయడంతోనే కావాల్సినంత పబ్లిసిటీ దక్కింది. సోషల్ మీడియాలో ఆర్యన్ ఖాన్ వర్సెస్ సమీర్ వాఖండే పేరిట ప్రత్యేక కథనాలు వైరల్ అవుతున్నాయి. డెబ్యూతోనే ఆర్యన్ ఖాన్ ఈ రేంజ్ లో సంచలనమవు తాడని తాను కూడా ఊహించి ఉండడు. సినిమా అయినా..సిరీస్ అయినా వివాదాస్పదమైతే? పబ్లిసిటీ కోసం పెద్దగా ఖర్చు చేయాల్సిన పనిలేదు. జనాల్లోకి ఆ వివాదమే తీసుకెళ్లిపోతుందని మరోసారి రుజువైంది.

# లేక్ కోమో వద్ద ఆమ్నా షరీఫ్



# ఎరుపు చీరలో శ్రద్ధా కపూర్ కిల్లర్ లుక్స్



బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి తన కొత్త లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటూ ఉంటుంది. లేటెస్ట్ గా ఎరుపు రంగు చీరలో ఆమె షేర్ చేసిన ఫోటోలు ట్రెండింగ్‌లో ఉన్నాయి. సింపుల్ జువెలరీ, లైట్ మేకప్, క్లాసీ హేర్ స్టైల్‌తో ఆమె గ్లామర్ గర్ల్ గా మెరిసింది. ఎరుపు రంగు చీరలో ఆమె కిల్లర్ లుక్స్ ప్రత్యేకంగా ఆకట్టుకోవడం ఫోటోలకు మరింత లైఫ్ ఇచ్చింది.

శ్రద్ధా కెరీర్ విషయానికి వస్తే, రొమాంటిక్ సినిమాల నుంచి యాక్షన్ ఎంటర్టైనర్స్ వరకు విభిన్న పాత్రల్లో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆషికీ 2తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ఆమె, ఆ తర్వాత ఏబీసీడి 2, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్, సాహెూ వంటి చిత్రాల్లో నటించింది. ముఖ్యంగా ప్రాభాస్ సరసన వచ్చిన సాహెూలో ఆమె పాత్ర తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ చేసింది. ఆమధ్య వచ్చిన తూ ఝూటీ మైన్ మక్కార్లో కూడా శ్రద్ధా ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో బాగానే ఆకట్టుకుంది. రన్‌బీర్ కపూర్‌తో చేసిన ఆ సినిమా మ్యూజికల్ ఎంటర్టైనర్‌గా మంచి హిట్టయింది. ఇక హారర్ మూవీ స్త్రీ2తో మరో బిగ్ హిట్ అందుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో కొన్ని లేడి ఓరియెంటెడ్ ప్రాజెక్టులు ఉన్నాయని బాలీవుడ్ వర్గాల సమాచారం.

ఈ క్రమంలో ఆమె కొత్త లుక్స్, ఫొటోషూట్లు ఫ్యాన్స్‌ను బాగా కనెక్ట్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో శ్రద్ధా షేర్ చేసిన ఈ ఎరుపు చీర ఫోటోలు అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ అందుకుంటున్నాయి. క్వీన్ ఆఫ్ బ్యూటీ అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. రెండు గంటల్లోనే లక్షల లైక్స్ రావడం చూస్తే ఆమె క్రేజ్ ఎంత ఉందో అర్థమవుతుంది. ప్రతి ఫోటోలోనూ గ్లామర్ ను మిక్స్ చేస్తూ ముందుకు సాగుతున్న ఆమె, రాబోయే ప్రాజెక్ట్స్‌తో మరోసారి ప్రేక్షకులను తన వైపు తిప్పుకునే అవకాశం ఉంది.

# మెరిసే సిల్వర్ గ్లామ్‌లో సోఫీ చౌదరి అబ్బురపరిచింది

